నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 22 ఏప్రిల్ 2024 | HYDERABAD

• మంగళ హారతులిచ్చి..

గోల్నాక, ఏప్రిల్ 21: సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభించింది. అడుగడుగునా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి..దీవెనలు అందించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ..తనను గెలిపిస్తే ఢిల్లీలో తెలంగాణ గళం వినిపిస్తానన్నారు.

• దీవించండి..

ఆదివారం జాంబాగ్ డివిజన్ గౌలిగూడ, న్యూ ఉస్మాన్ గంజ్, పూసల బస్తీ, గోల్డెన్ ప్రెస్ గల్లీలో హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ప్రచారంలో భాగంగా పాదయాత్ర చేశారు. ఇంటింటికీ తిరుగుతూ.. కారు గుర్తుకే ఓటు వేసి.. తనను గెలిపించాలంటూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. -అబిడ్స్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ప్రజా ఆకాంక్షను నెరవేరుస్తాం

ఉప్పల్, ఏప్రిల్ 21 : ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది బీఆర్ఎస్ పార్టీయేనని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపగడపకు వెళ్లి ప్రచారం చేయాలని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన విషయాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్‌పాషా, కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

అడుగడుగునా ఆదరణ

మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి అడుగడుగునా ఆదరణ లభిస్తున్నది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. అలాగే ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, సుధీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి వారి నియోజకవర్గాల్లో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రచార వ్యూహాలను మార్చుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ..ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇక బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతల ప్రచారం అంతంత మాత్రంగానే ఉన్నది. ఆ రెండు పార్టీల అభ్యర్థులు స్థానికేతరులు కావడంతో ఇరు పార్టీలకు చెందిన శ్రేణులు కొంత నిరుత్సాహంగా ఉన్నారు. దీనికితోడు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందిన నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సరైన క్యాడర్ లేకుండాపోయింది.

మోండా డివిజన్ సెకండ్‌బజార్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

ఆ ఘనత కేసీఆర్‌దే

కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 21: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత అన్నారు. ఆదివారం మోండా డివిజన్ లోని శివాజీనగర్, చాపల బావి, సెకండ్‌బజార్, డొక్కలమ్మ బస్తీ, కుమ్మరిగూడ తదితర ప్రాంతాల్లో స్థానిక మాజీ కార్పొరేటర్ రూప ఆధ్వర్యంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కుమార్తె మౌనికరెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ...బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎవరూ సంతోషంగా లేరని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హరి, రామరావు, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్: బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి కంటోన్మెంట్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో సాయన్న చేసిన సేవలు ఇంకా కండ్ల ముందే కనిపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందితలను కోల్పోయి..పుట్టెడు దుఃఖంలో కూడా ప్రజా సేవ చేసేందుకు వచ్చిన నివేదితను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కృష్ణా నీరు తరలింపు సవాలే

సాగర్‌లో 507 అడుగుల మేర నీటి నిల్వలు

500 అడుగులకు పడిపోతే..ఇబ్బందే

జూలై దాటితే బార్జ్ టెక్నాలజీతో రెండో విడత పంపింగ్.. అధికారుల వెల్లడి

సకాలంలో వరదలు ప్రారంభం కాకపోతే నగర తాగునీటిపై తీవ్ర ప్రభావం

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ ప్రజల దాహార్తిలో ముఖ్యభూమిక పోషిస్తున్న కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా నగరానికి రోజూ 270 ఎంజీడీలు (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని జలమండలి అందిస్తున్నది. కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది సరైన వరద నీరు లేదు. శ్రీశైలం, సాగర్ కలిసినా 12.86 టీఎంసీల నీటి కొరత ఏర్పడింది. దీనికి తోడుగా రెండు రాష్ట్రాల నీటి అవసరాలు... ముఖ్యంగా ఏపీ ధోరణితో ప్రస్తుతం సాగర్‌లో 507 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో సాగర్ నీటి నిల్వ 524 అడుగుల మేర ఉండగా..ఈ సారి నీటి మట్టం డెడ్ స్టోరేజ్ చేరింది. ఈ ప్రభావం హైదరాబాద్ తాగునీటిపై పడకుండా ఉండేందుకు ఏడేండ్ల తర్వాత జలమండలి అత్యవసర పంపింగ్‌కు రూ. 3 కోట్లు ఖర్చు చేశారు. సాగర్ ఫోర్‌షోర్‌లో 10 అత్యవసర మోటర్లు (స్టాండ్ బై 4 మోటర్లు)ఏర్పాటు చేసి, నగరానికి రోజూ మూడు దశల్లో 270 ఎంజీడీల (మిలియన్ గ్యాలన్ పర్ డే) చొప్పున నీటిని తరలిస్తున్నారు.

పుట్టగండి అప్రోచ్ కెనాల్ ద్వారా..

సాగర్ జలాశయంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టగండి అప్రోచ్ కెనాల్ ద్వారా దాదాపు 9.2 కిలోమీటర్ల మేర నీటిని పంపు చేసి.. అక్కంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నారు. అక్కంపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 1.5 టీఎంసీ (అంటే నెలకు సరిపడా నీటి నిల్వ) ఉండగా, ప్రస్తుతం 1 టీఎంసీల మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలోనే సాగర్ నీటి నిల్వల అంశానికి వస్తే 500 అడుగుల వరకు ఇప్పుడున్న పంపింగ్‌కు ఎలాంటి ఢోకా లేదు. 12 టీఎంసీల మేర నీరు ఉన్నప్పటికీ లాసెస్ (మండుతున్న ఎండలతో నీటి ఆవిరి, ఇతర)పోతే 9 టీఎంసీల మేర నగర తాగునీటి అవసరాలకు వాడుకోవచ్చు.

సిటీకి కృష్ణా జలాల తరలింపులా..

- గ్రేటర్‌కు 138 కి.మీ దూరంలో ఉన్న అక్కంపల్లి జలాశయం నుంచి నిత్యం మూడు దశల పంపింగ్ ద్వారా 270 మిలియన్ గ్యాలన్ల కృష్ణా జలాలను రాజధానికి తరలిస్తున్నారు.
- అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 34 కి.మీ దూరంలోని కోదండాపూర్‌కు గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నారు. అక్కడ శుద్ధి చేసి 353 మీటర్ల ఎత్తున లిఫ్టు ద్వారా నాసర్లపల్లికి పంపింగ్ చేస్తున్నారు. అక్కడి నీటిని శుద్ధి చేసి 495 మీటర్ల ఎత్తున లిఫ్టు చేసి.. 20 కి.మీల దూరంలో ఉన్న గోడకండ్ల రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు.
- గోడకండ్ల రిజర్వాయర్ నుంచి 618 మీటర్ల ఎత్తున లిఫ్టు చేసి 31 కి.మీ దూరంలో ఉన్న గున్‌గల్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు... అక్కడి నుంచి 29 కి.మీ దూరంలో ఉన్న సాహెబ్‌నగర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలిస్తున్నారు. అక్కడి నుంచి రింగ్ మెయిన్ పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలకు నీటిని అందిస్తున్నారు. పాతనగరంతో పాటు ఎల్బీనగర్, రాజేంద్రనగర్, ఉప్పల్, మలక్‌పేట, మహేశ్వరం, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాలు లబ్ధిపొందుతున్నాయి.

జూలై చివరి నాటికల్లా..

మిషన్ భగీరథతో పాటు నగర తాగునీటికి నెలకు 1.5 టీఎంసీల నీటిని వాడితే ఐదు నెలలకు పైబడి నగర తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నప్పటికీ జూలై చివరి నాటికల్లా 500 అడుగుల లోపు నీటి నిల్వలు పడిపోతే బార్జ్ టెక్నాలజీని ఉపయోగించి రెండో విడతగా అత్యవసర పంపింగ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు రెండు నెలలకు ముందస్తుగానే ఈ పంపింగ్ ఏర్పాట్లు చేస్తామని పేర్కొంటున్నారు. మొత్తంగా తొమ్మిది టీఎంసీలలో 6 టీఎంసీల నీటి తరలింపులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని, ఆ తర్వాతనే నీటి తరలింపు మరింత కష్టసాధ్యమవుతుందన్న వాదనల నేపథ్యంలో జూలై, ఆగస్టు మాసంలో కృష్ణా జలాల తరలింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా నాగార్జునసాగర్‌కు జూలై, ఆగస్టుల్లో వరదలు వచ్చే అవకాశాలుంటాయి. ఈ సారి కొంచెం ఆలస్యమైతే పరిస్థితి ఏమిటన్న దానిపై ఆందోళన నెలకొన్నది. రెండో విడత అత్యవసర పంపింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమిస్తారన్నది చూడాలి.

సరిగ్గా ఏడేండ్ల తర్వాత ..

నాగార్జున సాగర్ నుంచి అత్యవసర మోటర్ల ద్వారా నగరానికి నీటి తరలింపు జలమండలికి కొత్తేమి కాదు..కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టిన సందర్భంలో సాగర్ నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా అక్కంపల్లికి.. అక్కడి నుంచి కోదండపూర్ ..నాసర్లపల్లి, గోడకొండ్ల..గునగల్..సాహేబ్‌నగర్ వరకు కృష్ణా జలాలను మూడు దశల్లో నగరానికి రోజూ 270 ఎంజీడీలను చేర్చుతున్నారు. అక్కంపల్లిలో 1.5 టీఎంసీల నీరు స్టోరేజీ నిత్యం ఉంచుతారు. నీటి తరలింపులో ఎలాంటి పరిస్థితులు ఉన్నా...అక్కంపల్లిలో నిల్వ ఉన్న నీరు నెల రోజుల వరకు సరిపోతుంది. అయితే అత్యవసర తరలింపు ప్రక్రియ సరిగ్గా 2017 లో దాదాపు 120 రోజుల పాటు నడిపించారు. ప్రస్తుతం అత్యవసర పంపింగ్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రత్యేక సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

• శభాష్.. పోలీస్

నాగ్కెట్‌పల్లికి చెందిన విద్యార్థిని వైష్ణవి టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష రాసేందుకు ఆదివారం నగరానికి ఆటోలో వచ్చారు. ఆటో డ్రైవర్ తప్పిదం వల్ల నారాయణగూడ గురునానక్ హైస్కూల్ వద్ద దిగారు. ఆ తర్వాత హాల్ టికెట్ చూసుకోగా, అందులో పరీక్ష కేంద్రం అంబర్‌పేట పటేల్‌నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అని ఉన్నది. సమయం తక్కువగా ఉండటంతో అక్కడికి ఎలా వెళ్లాలో తెలియక కన్నీరుపెట్టుకున్నారు. గమనించిన సీఐ చంద్రశేఖర్ వెంటనే పెట్రోలింగ్ వాహనంలో వైష్ణవిని పరీక్ష కేంద్రానికి సమయానికి తీసుకెళ్లారు. పరీక్ష రాసి వచ్చిన వైష్ణవి..పోలీసులకు కృతజ్ఞతలు చెప్పారు. -హిమాయత్‌నగర్

నమ్మకండి.. అనుమానించండి

క్రెడిట్ బిల్లులో రాయితీ అంటూ ఫోన్లు

వివరాలు తీసుకొని.. డబ్బులు స్వాహా

కొత్త మోసానికి తెరలేపిన సైబర్ చీటర్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): 'మేం క్రెడిట్ కార్డు కాల్‌సెంటర్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ క్రెడిట్ కార్డుకు సర్వీస్ చార్జీలు.. బిల్లులో రాయితీ ఇస్తున్నాం.. ఈ అవకాశాన్ని వాడుకోండి.. నెలవారి బిల్లు తగ్గుతుంది.. మీరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలంటే ఈ కింద లింక్‌ను క్లిక్ చేసి, వివరాలను పొందుపరచండి'.. అంటూ కొత్త తరహా మోసాలకు తెరలేపుతున్నారు సైబర్‌నేరగాళ్లు. నెలవారీ బిల్లులో నిజంగానే తగ్గుతుందనే ఆశతో క్రెడిట్ కార్డుదారు నేరగాళ్లు సూచించిన లింక్‌ను క్లిక్ చేస్తూ.. మోసపోతున్నారు.

నకిలీ వెబ్‌సైట్..

సైబర్‌నేరగాళ్లు రోజుకో కొత్త తరహా పంథాతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ మోసాల్లో ఒకటి క్రెడిట్ కార్డు రాయితీ. దీని కోసం నకిలీ వెబ్‌సైట్లను తయారు చేసి, ఆ లింక్‌లను బాధితులకు పంపిస్తున్నారు. వాటిపి క్లిక్ చేయగానే ఒక వైపు బ్యాంకు పేరు కూడా కనిపిస్తుంది. దీంతో, ఆ లింక్‌లోని మెసేజ్ నిజమేనని బాధితులు నమ్ముతున్నారు. 'ఆ లింక్ క్లిక్ చేసి మీ వివరాలు పొందుపర్చండి'.. అంటూ నేరగాళ్లు సూచిస్తున్నారు. దీంతో బాధితులు క్రెడిట్‌కార్డు, సీవీవీల నంబర్లను కూడా అందిస్తున్నారు. ఆ సమయంలో ఓటీపీ కూడా వస్తుంది. అయితే ఓటీపీ ఇచ్చే సమయంలో కొందరు అనుమానించి..మోసాన్ని గుర్తిస్తున్నారు. మరికొందరు మాత్రం ఓటీపీని కూడా చెప్పేస్తున్నారు. ఇలా ఓటీపీ చెబితే.. ఆ క్రెడిట్ కార్డు మొత్తం సైబర్‌నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఓటీపీ చెప్పే వరకు ఆ క్రెడిట్ కార్డు లిమిట్ ఎంత అనే విషయాన్ని కూడా తెలుసుకుంటున్నారు. మీకు ఈ నెల క్రెడిట్ కార్డు బిల్లు ఎంత వచ్చిందనే విషయాన్ని నేరుగా బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు.

రూ.2 లక్షలు స్వాహా

నగరానికి చెందిన ఓ వ్యాపారికి క్రెడిట్ కార్డు నెలవారీ బిల్లులో తగ్గింపు ఇస్తున్నామంటూ ఫోన్ చేశారు. ఆయన వారి మాటలు నిజమని నమ్మాడు. వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే ప్రైవేట్ బ్యాంకు పేరుతో ఒక వెబ్‌సైట్ పేజీ ఓపెన్ అయ్యింది. అందులో ఒక ఫామ్ ఇచ్చి, వివరాలు పొందుపరచాలంటూ.. నేరగాళ్లు సూచించారు. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న క్రెడిట్‌కార్డు వివరాలను అందించాడు. ఓటీపీ కూడా చెప్పడంతో సైబర్‌నేరగాళ్లు రూ. 2.03 లక్షలు స్వాహా చేశారు.

పౌరులకు బ్రహ్మాస్త్రం!

ఎన్నికల ఉల్లంఘనలపై 'సీ-విజిల్'కు ఫిర్యాదులు

ఇప్పటి వరకు 247 ఫిర్యాదులు..

వంద నిమిషాల్లో పరిష్కారం

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : సాధారణంగా ఎన్నికలు అనగానే ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు రాజకీయ పార్టీలు ఉపక్రమిస్తుంటాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉల్లంఘనులు తప్పించుకోవడానికి వీల్లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని భారత ఎన్నికల సంఘం పక్కాగా అమలు చేస్తున్నది. నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపుతున్నది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు 247 ఫిర్యాదులు రాగా, వాటన్నింటినీ వంద నిమిషాల్లో పరిష్కరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సీ-విజిల్ యాప్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

జూబ్లీహిల్స్ నుంచే అధికం

సీ విజిల్‌లో ఫిర్యాదులను పరిశీలిస్తే..అత్యధికంగా జూబ్లీహిల్స్ నుంచి 69 రాగా, ఆ తర్వాత ఖైరతాబాద్ నుంచి 60, సనత్‌నగర్‌లో 33, చాంద్రాయణగుట్టలో 15, కంటోన్మెంట్‌లో 10, యాకత్‌పురలో 10, అంబర్‌పేటలో 7, చార్మినార్ నుంచి 5 ఫిర్యాదులు రాగా, అధికారులు పరిష్కరించారు.



ఈ అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు..

- ఓట్ల కోసం అభ్యర్థులు వారి అనుచరులు భౌతికంగా, మానసికంగా భయాందోళనకు గురి చేయడం.
- బహిరంగ ప్రదేశాల్లో విద్వేషపూరిత ప్రసంగాలతో ఓటర్లను రెచ్చగొట్టడం.
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, మద్యం పంపిణీ.
- ప్రచార గడువు ముగిసినా.. స్పీకర్లు వాడటం, వస్తువులు, సామగ్రి పంపిణీ.
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో బాధ్యతారహితంగా పనిచేయడం.
- ఎన్నికల ప్రచార నిబంధనలు ఉల్లంఘించడం.

ఫిర్యాదు చేయండిలా..

'సీ-విజిల్' యాప్‌ను ఈ ఎన్నికల్లో బ్రహ్మాస్త్రంగా వినియోగించుకోవచ్చు. గూగుల్ లేదా ప్లేస్టోర్‌లో సీ-విజిల్ యాప్ అని టైపు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉన్న చోటు నుంచే ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఉల్లంఘనలకు సంబంధించిన చిత్రాలను తీసి ఫిర్యాదు చేస్తే చాలు. ఈ సమయంలో ఫిర్యాదు చేసే వ్యక్తి తమ వివరాలను నమోదు చేయాల్సిన అవసరం లేదు. వారి వివరాలు గ్రూప్‌లో ఉంటాయి. ఫిర్యాదుకు సంబంధించిన ఫొటో కానీ రెండు నిమిషాల నిడివితో ఉన్న వీడియోలు కానీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వంద నిమిషాల్లో సమస్యను పరిష్కారిస్తారు. ఆ తర్వాత సంబంధిత ఫిర్యాదుదారుడి ఐడీకి సందేశం పంపిస్తారు.

వంద నిమిషాల్లోనే..

రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో పాటు సాధారణ ప్రజలు చేసిన ఫిర్యాదులు 5 నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి క్షేత్రస్థాయి పరిశీలనలోని ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు చేరుతుంది. వారు 15 నిమిషాల్లో క్షేత్రస్థాయి విచారణ చేస్తారు. ఆ నివేదికను 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి వెళ్లేలా చూస్తారు. దానిని రిటర్నింగ్ అధికారి 45 నిమిషాల్లో పరిశీలిస్తారు. అక్కడ నిర్ధారణ కాకపోతే ఫిర్యాదు జిల్లా ఎన్నికల అధికారి పరిష్కరిస్తారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుకు వంద నిమిషాల్లోనే పరిష్కారం చూపుతారు.

అంతరాయం.. నిరంతరం..

డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై పెరుగుతున్న లోడు

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఆ శాఖ చర్యలు చేపట్టినా.. క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటున్నది. తరచూ సరఫరాలో అంతరాయం షరా మామూలే అన్నట్లుగా మారింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) నుంచి ఇంటికి వెళ్లే లైన్లపై వేసవి కాలంలో లోడ్ గణనీయంగా పెరుగుతున్నది. దీనివల్ల డీటీఆర్ వద్ద ఉండే ఫ్యూజ్ బాక్సులో పవర్ ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతోంది. శనివారం సాయంత్రం హిమాయత్‌నగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 15 నిమిషాల పాటు అంతరాయం ఏర్పడింది. స్పందించిన సిబ్బంది వెంటనే సరఫరాను పునరుద్ధరించారు. ఇలా నగరంలో ఒక్క చోటే కాదు... తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం 5,10,15 నిమిషాల పాటు ఉంటున్నది. ఒక విద్యుత్ కార్యాలయం సెక్షన్ పరిధిలో 20-30వేల కనెక్షన్లు ఉంటే, వాటికి కరెంటు సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ నుంచి వచ్చే ఫీడర్ల పరిధిలో పదుల సంఖ్యలో డీటీఆర్‌లు ఉంటాయి. ఇలా పదుల సంఖ్యలో ఉన్న డీటీఆర్‌లపై వేసవిలో తరచూ లోడ్ పెరగడం వల్ల ఒకే సమయంలో పలు చోట్ల తలెత్తే అంతరాయాలను పునరుద్ధరించేంత సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండటం లేదు. డీటీఆర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ బాక్సులో సమస్యను పరిష్కరించాలంటే 5-10 నిమిషాల సమయం పడుతున్నది. క్షేత్ర స్థాయిలో ఉండే సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని సరఫరాను పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది తక్కువ ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లి మరమ్మతులు చేయడానికి కొంత సమయం పడుతోంది. ఇలా ప్రతి రోజూ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోనే ఎక్కువ అంతరాయాలు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇది స్వల్ప కాలం అంతరాయం తప్ప, విద్యుత్ కోతలు కావని, సరఫరా నిలిచిపోయిన చోటుకు సిబ్బంది వెళ్లి సరి చేసేందుకు కొంత సమయం పడుతోందని చెబుతున్నారు.